క్లుప్తంగా

అన్ని రకాల వ్యాక్సిన్లు వేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్):ప్రజలకు అన్ని రకాల వ్యాధినిరోధక టీకాలను వేయాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ అమృత తెలిపారు. 63వ డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. పోలియో, కోరింతదగ్గు, ధనుర్వాతం, కామెర్లు, పొంగు, తట్టు, రే చీకటి, నిమోనియ నివారణకు సంబంధించిన 11 రకాల టీకాలను తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్ళి సర్వే నిర్వహించాలని అక్కడ గుర్తించిన వారికి వ్యాక్సినేషన్లు వాడాలన్నారు. అనంతరం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని డ్రైనేజీలను పరిశీలించారు. దోమల నివారణకు డ్రైనేజీ కాల్వలు శుభ్రంగా వుండేలా శానిటేషన్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావటంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పారాయణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సౌందర్య లహరి, శివానందలహరి పారాయణ జరిగింది. అమ్మవారి ఆలయప్రాంగణంలోని ధర్మపథం వేదికపై వి.ప్రసన్నకుమారి బృందం పలు కీర్తనలను లయబద్ధంగా ఆలపించింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పారాయణలో భాగస్వాములయ్యారు. అనంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందించారు.

కాలువ గట్లను సుందరీకరించాలి

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరంలోని మూడు ప్రధాన కాల్వ గట్లను సుందరీకరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మధురానగర్‌లోని ఏలూరు కాల్వ వెంబడి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ కాల్వ గట్లపై ఉన్న వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మొక్కలు నాటి సుందరీకరించాలని సూచించారు. నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వాటిలో వాకింగ్ ట్రాక్, పాత్‌వే, చిన్నారులు ఆడుకునేందుకు ఆటపరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వీటికి 15వ ఆర్థిక కమిషన్ నిధులు వెచ్చించాలని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్ఈ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కబేళా సెంటర్ వద్ద లారీ దగ్ధం



భవానీపురం(విజయవాడపశ్చిమ):విజయవాడ నుంచి మచిలీపట్నం పోర్ట్‌కు లోడ్‌తో వెళుతున్న లారీ విద్యాధరపురం కబేళా సెంటర్ వద్ద దగ్ధం అయిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి గ్రానైట్ రాయి లోడుతో బందరు పోర్ట్‌కు వెళుతున్న లారీ కబేళా సెంటర్ దగ్గరకు వచ్చేసరికి లారీ క్యాబిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీ దిగిపోయాడు. నిత్యం రద్దీగా ఉండే కబేళా సెంటర్‌లో టిప్పర్ నుంచి మంటలు ఎగిసి పడుతుండటంతో స్థానికులు పరుగులు తీశారు. వెంటనే కొత్తపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసింది.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు శ్రీ ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన కార్తీక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో ప్రతీ రోజు స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు సాయంత్రం 6 గంటలకు అన్నాభిషేకం జరుగుతాయన్నారు. 15వతేదీ కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి విశేషంగా బిల్వార్చన, జ్వాలాతోరణం చేస్తామని చెప్పారు. వచ్చే నెల 29వ తేదీ సాయంత్రం శ్రీ శివకామేశ్వరీ నీలకంఠేశ్వరస్వామి వార్ల కల్యాణ ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కుక్కలు ఫుల్.. ఇంజక్షన్లు నిల్ !



రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు



- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కాటు వేస్తే ఇచ్చే ఇంజక్షన్ల కొరత
- ప్రాణాంతకర 'రేబిస్' వ్యాధిపట్ల కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- సింగ్‌నగర్, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో చేతులెత్తేసిన వైద్యాధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, ఇందిరానాయక్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, కండ్రిక పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ.. ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇక్కడ ఏ వీధి చూసినా.. ఏ రోడ్డుకు వెళ్లినా పదుల సంఖ్యలో గ్రామ సింహాలు దర్శనమిస్తూ ఒంటరిగా రాకపోకలు సాగించే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. వీధికుక్కలను అదుపుచేయడం లేకపోగా.. కనీసం కుక్కలు దాడి చేసిన తరువాత ఇచ్చే ఇంజక్షన్లను కూడా లేకుండా చేసి ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతుంది.

ఒక్క చోట కూడా ఇంజక్షన్లు లేవు.....

స్థానిక 57, 58, 59, 60, 61, 62, 63, 64 డివిజన్ల పరిధిలోని సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, న్యూఆర్ఆర్‌పేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లోని చిన్నారులు, పెద్దలు తరచూ వీధి కుక్కల దాడిలో గాయాలపాలవుతున్నారు. కుక్క కరిసిన తరువాత రేబిస్ వ్యాధి సోకకుండా ఇంజక్షన్ల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తుంటే ఇక్కడ ఒక్క చోట కూడా ఆ ఇంజక్షన్లు లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో కూడా రేబిస్ ఇంజక్షన్లు లేకుండా ఉంటే ఎలా అని నిలదీస్తున్నారు. బాధితులపై కొంతమంది వైద్య సిబ్బంది తమదైన శైలిలో విసుక్కుంటున్నారు. ఇంజక్షన్లు కావాలంటే పెద్ద ప్రభుత్వ హాస్పటల్‌కు వెళ్లండి. లేకపోతే మేమేమీ చేయలేమని చేతులు దులుపుకొని వదిలేస్తున్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా చెప్పుకోడానికి డివిజన్‌కో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం ఉన్నా వాటిలో ప్రజలకు అవసరమైన ఇంజక్షన్లు, మందులు లేకపోవడం ఏంటని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఆరోగ్య కేంద్రాలపై దృష్టి పెట్టి ప్రజలకు అవసరమైన ఇంజక్షన్లు, మందులన్నింటినీ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రోగులు కోరుతున్నారు.



ఇందిరానాయక్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

ఇంజక్షన్లు లేవన్నారు



రోడ్డుపై ఒంటరిగా నడుస్తుంటే వెనుక నుంచి వచ్చి కుక్క కరిచింది. వెంటనే నేను రేబిస్ వ్యాధి సోకకుండా ఇంజక్షన్ల కోసమని ఇందిరానాయక్‌నగర్‌లోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అడిగాను. అక్కడ ఇంజక్షన్లు లేవన్నారు. సరే అని సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలను కూడా సంప్రదించాను. ఒక్కచోట కూడా ఇంజక్షన్లు లేవు. వన్‌టౌన్ చెరువు సెంటర్‌లోని రాజాసాహెబ్ హాస్పటల్‌కు వెళ్లి ఇంజక్షన్లు వేయించుకున్నాము.

దుర్గాలావణ్య, ఇందిరానాయక్‌నగర్

వీధి కుక్కల సమస్య పరిష్కరించాలి



సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కువ శాతం నిరుపేద ప్రజలే జీవిస్తున్నారు. ఇక్కడ వీధికుక్కల సమస్య చాలా తీవ్రంగా ఉంది. రాత్రుల సమయంలో ఒంటరిగా రోడ్డుపైకి వెళ్తుంటే దాడులు చేస్తున్నాయి. ఇంజక్షన్ల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ తిరిగినా లేవని చెబుతున్నారు. వేరే దారి లేక ఏలూరు రోడ్డులో ఉన్న పెద్ద ప్రభుత్వ హాస్పటల్‌కు వెళ్లి ఇంజక్షన్లు చేయించుకోవాల్సి వస్తుంది.

మల్లెల చెన్నకేశవరెడ్డి, న్యూఆర్ఆర్‌పేట

సాయం చేయండి మహాప్రభో!

- సర్వం కోల్పోయి సాయం కోసం వేడుకుంటున్న వరద బాధితులు
- కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాధితుల ఆవేదన



పశ్చిమ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందజేస్తున్న బాధితులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):'బుడమేరు వరద మా బతుకుల్ని నాశనం చేసింది... వరద తాకిడికి సర్వస్వం కోల్పోయాం... 55 రోజులు గడిచినా ప్రభుత్వ సాయం అందలేదు... సచివాలయం నుంచి ఎమ్మార్వో కార్యాలయం , అక్కడ నుంచి కలెక్టరేట్‌కు తిరుగుతూనే ఉన్నాం... దరఖాస్తులపై దరఖాస్తులు చేస్తున్నాం... ప్రభుత్వం పట్టించుకోవడం లేదు... వరద నష్ట పరిహారం ఇవ్వలేదు... పెట్టిన దరఖాస్తులకు అతీగతీ లేదు'.... అంటూ వరద బాధితులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద సాయం అందించండి మహాప్రభో.. అంటూ బాధితులు ఆందోళనకు దిగారు. సీఎం చంద్రబాబు వరదల్లో పడవలపై , జేసీబీ సహాయంతో ఈ ప్రాంతమంతా తిరిగారు. తీరా పరిహారం ఇచ్చే సమయానికి తమ ప్రాంతం రెడ్‌జోన్‌లో లేదంటూ పరిహారం ఎగ్గొట్టారు అంటూ బాధితులు మండిపడ్డారు. తమ ఇళ్లు, ఇంట్లోని విలువైన వస్తువులన్నీ పాడైపోయాయంటూ ఫొటోలతో సాక్ష్యాలు చూపాం. కానీ పరిహారం మాత్రం అందలేదు. అదేమని అడిగితే సమాధానం చెప్పే నాథుడే లేడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ పశ్చిమ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితులకు పరిహారం అందించాలంటూ శుక్రవారం మహాధర్నా జరిగింది. వరద బాధితులు పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొని తమ గోడు వెళ్లబోసుకున్నారు. వరదల్లో మునిగిపోయిన తమ ఇళ్ల ఫొటోలు సైతం తీసుకొని వచ్చి ఆందోళన చేశారు. ఊర్మిళానగర్, ప్రియదర్శిని కాలనీ, ఔట్ ఏజెన్సీ, బాలభాస్కర్ నగర్, కుమ్మరిపాలెం సెంటర్, సాయిరాం థియేటర్, కబేళా ప్రాంతాలకు చెందిన బాధితులు మరోసారి తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు.

పరిహారం అందలేదు



వరద నీరు ఇంట్లోకి చేరింది. బైక్ , ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. వరదల్లో పూర్తిగా నష్టపోయాం. పరిహారం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. ఆ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్లాం. పరిహారం మాత్రం అందలేదు. ఈ రోజు తహశీల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసేందుకు వచ్చాను. రీ సర్వే చేసి పరిహారం అందించాలి.

కొసనం కోటేశ్వరరావు, బాధితుడు

పేరున్నా పరిహారం ఇవ్వలేదు



వరద నీటిలో నాలుగు రోజులు గడిపాం. ఇంట్లో ఏ వస్తువు కూడా పనికిరాకుండా పోయింది. సర్వే బృందాలు వచ్చి సర్వే చేశాయి. పరిహారం జాబితాలో పేరు వచ్చింది. కానీ ఇంత వరకు ప్రభుత్వ సాయం మాత్రం అందలేదు. పరిహారం ఇవ్వాలని అడిగిన చోటల్లా దరఖాస్తులు చేస్తున్నాను. అన్ని చోట్లకు తిరిగాం. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ సాయం అందించాలి.

దుర్గామల్లేశ్వరి, వరద బాధితురాలు

పూర్తిగా నష్టపోయాం



కనీవినీ రీతిలో వరద వచ్చింది. వరదల్లో ఇంట్లో సామగ్రి మొత్తం దెబ్బతింది. సర్వే చేశారు. అధికారులు వచ్చి చూశారు. సచివాలయంలోనూ వెళ్లి చెప్పాం. కానీ 55 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. ఇక ఎవరికి చెప్పుకోవాలి. పూర్తిగా నష్టపోయాం. అన్ని చోట్లకు వెళ్లి మా బాధ చెబుతున్నా స్పందన లేదు.

ఉమాదేవి, వరద బాధితురాలు

పెన్షన్‌దారులకు ఆర్థిక సాయం అందజేత



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, పక్కన అసోసియేషన్ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):బీఎస్ఎన్ఎల్ పింఛన్ దారుల సమస్యల పరిష్కారానికి సంస్థ కృషి చేస్తుందని.. వరదల బారిన పడిన పింఛన్‌దారులంతా త్వరగా కోలుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. బుడమేరు వరద ముంపులో నష్టపోయిన బీఎస్ఎన్ఎల్ పెన్షన్ దారులకు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత కార్యక్రమం సింగ్‌నగర్ గుజ్జుల సరళా దేవి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ నగర ప్రజలు ఎన్నడూ లేనివిధంగా వరద ముంపులో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ పెన్షన్‌దారులు కూడా చాలా వరకు నష్టపోయారని, వారికి బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 85 మంది బాధిత పెన్షనర్స్‌కి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ కోటేశ్వరరావు, కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు కె.పూర్ణ చంద్రరావు, కార్యదర్శి సి.భాస్కరరావు, సంస్థ డిప్యూటి జనరల్ డీజీఎం ఉమా మహేశ్వరరావు, ఏజీఎం పోతురాజు, నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

సద్గురువుల సేవలు సర్వదా శుభకరం



సంగీత కార్యక్రమాలను ప్రారంభిస్తున్న బీవీఎస్ ప్రకాష్, వేదికమీద నిర్వాహకులు



కీర్తనలు ఆలపిస్తున్న యువ సంగీత కళాకారులు

విజయవాడ కల్చరల్: సద్గురువుల సేవలు సర్వదా శుభకరమని శ్రీ సంగీత సద్గురు అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ అన్నారు. కృష్ణమాచారి కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వన్మణి శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శత జయంతి ముగింపు ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ సంగీతోత్సవాలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్ మాట్లాడుతూ జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువని తెలిపారు. కృష్ణమాచార్యులు గురించి మాట్లాడుతూ నిత్యం సంగీత సేవలో తరించిన పుణ్యమూర్తి కృష్ణమాచార్యులని అభివర్ణించారు. కళాపీఠం కార్యనిర్వాక సంఘ సభ్యులు ఎన్‌సీహెచ్ బుచ్చయ్యాచార్యులు, రామానుజా చార్యులు, శ్రీరామ చక్రవర్తి, కె.రంగనాయకి పాల్గొన్నారు. సద్గురువులకు సంగీత సేవలో భాగంగా వి.సౌమ్య, ఆర్.లక్ష్మీ రచిత, ఎ.రుక్మిణి, కృష్ణలాస్య బృందగానంతో వాగ్గేయకార కీర్తనలు ఆలపించారు. పి.కుమార్ బాబు వేణువుతోనూ వి.శ్రీవిద్య వీణపై పలు కీర్తనలు ఆలపించారు. దుడ్డు మనస్విని, ముడుంబై లక్ష్మీచారి, దుడ్డు రాధిక, పోపూరి గౌరీనాథ్ ఎన్‌సీ మాధవ్, ఎన్‌సీ అనంత కృష్ణ సంగీత సేవలో పాల్గొన్నారు. కౌశిక్ కల్యాణ్ నిర్వహించారు.

సంప్రదాయ కళలు కాపాడుకోవాలి



కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలు ప్రదర్శిస్తున్న సప్పా శివకుమార్ బృందం

విజయవాడ కల్చరల్: సంప్రదాయ నృత్య కళలను కాపాడుకోవాలని నాట్యాచార్యుడు వేదాంతం రాధేశ్యాం అన్నారు. శ్రీవాగ్దేవీ కూచిపూడి నృత్యాలయం రెండురోజులపాటు నిర్వహించే కూచిపూడి నృత్యహేల, నాట్యాచార్యుడు కాజవెంకట సుబ్రహ్మణ్యంకు గురు సత్కారం, సంప్రదాయ నృత్య ప్రదర్శనల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. నృత్య కార్యక్రమాలను ప్రారంభించి రాధేశ్యాం మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను భారతీయ వారసత్వ సంపదగా భావించాలని సూచించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ నృత్య కళాకారులు చిత్త శుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, అంకిత భావం కలిగివుండాలని సూచించారు. నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్ సభకు అధ్యక్షత వహించారు. వివిధ రంగాలకు చెందిన జోగిపర్తి శంకరరావు, వీజీవీవీడీఎస్ కుమార్, తటవర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు. నాట్యాచార్యుడు బి.శారద, కె.సాయి లక్ష్మి, మాగలూరి త్రినాథాచారి, వి.రమణకుమారి, అనూషా నాయుడు, సాయి లక్ష్మి, తమ బృందాలతో సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. నాట్యాచార్యుడు కాజ వెంకట సుబ్రహ్మణ్యంకు నిర్వాహకులు గురు సత్కారం, నాట్యంలో ప్రతిభ కనపరచిన చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, శివనంది, స్వర్ణ నంది పురస్కారాలు ప్రదానం చేశారు. సప్పా ధనలక్ష్మి నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్):పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాతపాయకాపురం, బర్మా కాలనీ, నూజివీడు రోడ్డు, కండ్రిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):గాంధీనగర్ సెక్షన్ 11 కేవీ అలంకార్ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రత్న రోడ్డు, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, నారా వారి వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, మల్లికార్జునవీధి, అలంకార సెంటర్ ఏరియా, పాపయ్య స్ట్రీట్, వాటర్ ట్యాంక్ –కాంప్లెక్స్, సన్యాసిరాజు స్ట్రీట్, ప్రెస్‌క్లబ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ గులాబీతోట ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌టీఎస్ రోడ్డు, పున్నయ్య కాలనీ, గులాబీ తోట, దేవీనగర్, రామకృష్ణాపురం, పసుపు తోట, సాయిబాబా కాలనీ, కొబ్బరి తోట, లెక్చరర్స్ కాలనీ, నేతాజీ కాలనీ, పప్పుల మిల్లు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వంలో గోవు, గుడికి రక్షణ కరువు

గోశాల కూల్చివేతపై మల్లాది విష్ణు ఆగ్రహం



గుడి సమీపంలో పడవేసిన వాటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):కూటమి ప్రభుత్వంలో దేవాలయాలు, గోవులకు రక్షణ కరువయిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. మధురానగర్ వీవీ నరసరాజురోడ్డులో వీఎంసీ అధికారులు కూల్చివేసిన గోశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో దౌర్జన్యంగా గోశాలను కూల్చివేయడం దారుణం అన్నారు. వీఎంసీ, ఇరిగేషన్ అధికారుల నిర్వాకానికి ఆవులన్నీ గాయపడ్డాయని.. ఆకలితో మండుటెండలో అలమటిస్తున్నాయని మండిపడ్డారు. గోమాత సకల దేవతా స్వరూపమని.. వేదాలు, పురాణాలు, ఇతిహాసాల నుంచి నేటి వరకు గోవు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. అటువంటి గోవులను రోడ్డున పడేసి.. ఈ ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వం గోవును రాష్ట్ర జంతువుగా గుర్తించి కాపాడుతుంటే.. మన రాష్ట్రంలో మాత్రం గోవులకు రక్షణ లేకుండా పోయిందని దుయ్యబట్టారు. గోశాలతో పాటు ఇతర ఆలయాలను దౌర్జన్యంగా కూలగొట్టారని ఆరోపించారు. కాల్వగట్టును పరిరక్షించడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రణాళికలు సిద్ధంచేసి.. ఫెన్సింగ్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. పత్రికలలో కథనాలు వస్తే తప్ప స్పందించని పరిస్థితి నెలకొందన్నారు. ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే భక్తులు ఇబ్బందులు పడుండేవారు కాదని చెప్పారు. కృష్ణా పుష్కరాల సమయంలోనూ నగరంలో 23 దేవాలయాలను కూల్చివేసిన చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని పునర్నిర్మించడం జరిగిందని గుర్తుచేశారు. మరలా కూటమి ప్రభుత్వంలో అటువంటి దారుణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమంటూ ఊగిపోయే పవన్ కళ్యాణ్, హిందుత్వానికి బ్రాండ్ అంబాసిడర్ గా చెప్పుకునే బీజేపీ.. దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ తనిఖీలు

లబ్బీపేటలోని నెక్సస్ గ్రోత్ సంస్థకు నోటీసులు



ఐసీఐసీఐ భారతీనగర్ బ్రాంచ్

విజయవాడస్పోర్ట్స్: ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాదారుల ఫిక్సిడ్ డిపాజిట్లు, ఓవర్‌డ్రాఫ్ట్‌లు, బంగారు రుణాల నగదును దారి మళ్లించిన వైనంపై సీఐడీ విచారణ చురుగ్గా సాగుతోంది. చిలకలూరిపేట, నరసరావుపేట బ్రాంచ్‌ల ఖాతాదారులు ఫిర్యాదుతో ఈ విషయం తొలుత వెలుగు చూసిన విషయం తెలిసిందే. అయితే విజయవాడలోనూ పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ అధికారులు భారతీనగర్ బ్రాంచ్‌లో శుక్రవారం విచారణ నిర్వహించారు. ఏకకాలంలో మూడు బృందాలు బ్యాంకులో సోదాలు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విజయవాడ బ్రాంచ్‌లలో మేనేజర్‌గా పని చేసిన నరేష్ ఈ అవినీతికి పాల్పడినట్లు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. నరేష్, అతనికి సహకరించిన మరి కొందరు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్లు, ఓవర్ డ్రాఫ్ట్, గోల్డ్ లోన్ ఖాతాదారులకు నకిలీ పత్రాలు ఇచ్చి నరేష్ మోసానికి తెగబడ్డారు. దీని ద్వారా వచ్చిన నగదును నరేష్, అతని సన్నిహితులు నెక్సస్ గ్రోత్ సంస్థ ద్వారా షేర్ మార్కెట్ పెట్టుబడులు పెట్టినట్లు సీఐడీ అధికారుల విచారణలో స్పష్టమైంది. నరేష్ బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలించిన అనంతరం లబ్బీపేటలోని నెక్సస్ గ్రోత్ సంస్థకు ఈ నెల 25న సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు ఖాతాల ద్వారా నగదును నెక్సస్ గ్రోత్‌కు నరేష్, మరి కొంత మంది వ్యక్తులు బదిలీ చేశారని ఈ నోటీసుల ద్వారా స్పష్టమవుతోంది. నరేష్ చేసిన మోసంలో నెక్సస్ గ్రోత్ సంస్థకు సైతం భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది.